# గంధపు చుక్క

మెలుకువ రావడంతోటే గడియారం వంక చూచాడు. రెండున్నర గంట అయింది. ఇక నిద్ర పట్టడం మాట వట్టిది. లేచి పనులు చూచుకోవడం బుద్ధికి లక్షణం అయిన పని.

పక్కమీద నుంచి లేవడానికి ముందు ఒక్కమారు గదంతా పరికించి చూచాడు. పక్కమంచం మీద 'తపతి' ముసుగు బిగతన్ని పడుకుని ఉంది. ఇప్పుడు ఆమెను లేపడం అనవసరం. చప్పుడు చేయకుండా చదువుల గదిలోనికి వెళ్లి కూర్చుంటే అదే మంచి పని.

టేబుల్ స్టాండ్ మీద కాలెండర్ కాగితం ఇంకా నిన్నటి రోజు, తేదీ చూపుతోంది. దానికేం తెలుసును, తారీకు మారిపోయిందని ? ఎవరేనా వచ్చి మార్చేంత వరకు అలాగే ఉండిపోతుంది; అందుకేమీ సందేహం లేదు.

కాలప్రవాహం మటుకు అలా కాదు. మనం కావాలనుకున్నా, అక్కర్లేదనుకున్నా, మనం ఏం అనుకుంటున్నాం అన్న ప్రసక్తే లేకుండా కాలం దానంతట అది ముందుకు వెళ్లిపోతూ ఉంటుంది. ఎవరి కోసమూ ఆగదు. పేచి ఉండదు. దానిని గురించి మనం ఏం అనుకుంటున్నామో అన్న ప్రమేయమే ఉండదు దానికి.

– ఈ విషయం గమనించి మనిషి మెలగగలిగితే ఎంత బాగుండును !

గది అతి నిశ్శబ్దంగా ఉంది. మంచం మీద నుంచి తాను కిందకు దిగిన చప్పుడు తప్ప ఇంకేం వినిపించలేదు.

టేబుల్ స్టాండ్ మీద అద్దం పలుకరించింది శేషాద్రిని. అద్దంలో ప్రతిబింబం అనుకోకుండానే చూచుకున్నాడు. తన ముఖం మటుకే కాకుండా, గదిలో చాలా భాగం అందులో కనిపిస్తోంది. ముఖ్యంగా తపతి పడుకున్న వైఖరి అద్దంలో చూడడానికే బాగుంది; యథార్థం కంటె. నిజం కంటే నీడ ఆకర్షకంగా ఉండడం అంటే ఇదే కాబోలు !

శేషాద్రి మళ్లీ ఆమె వంక చూచాడు. శ్వాస వదలడం, పీలవడంలో శరీరం ముందు

భాగం కదులుతోంది. ఈ కదలికల్లోని 'లయ' ఎంతసేపయినా చూచి ఆనందించ వచ్చును.

అయిదున్నర కాకుండా నిద్రలేపితే తపతికి కోపం వస్తుంది. అయినా అంత చేసుకోవలసిన పనులు కూడా ఏమీ లేవు. శేషాద్రి తను తొడుక్కున్న బనీను విప్పి స్టాండ్ మీద పడవేశాడు. ఏ మాత్రం చప్పుడు కాకుండా జాగ్రత్తపడుతూ, బాత్‌రూం తలుపు తెరిచి లోపలకు వెళ్లాడు.

దాదాపు స్నానం చేసినంత పనిచేసి, రాత్రి తాలూకు వాసనలు, మరకలు శరీరం మీద లేకుండా జాగ్రత్త పడ్డాడు. ముఖం కడుక్కోవడంతో పాటు, మనసు కూడా కడిగేసుకుని నిర్మలంగా తయారయి బయటకు వచ్చాడు.

మళ్లీ ఓమారు నిదానంగా తపతి వంక చూచి, ఆమెకు నిద్రాభంగం కాలేదని తృప్తిపడి ఆ గదిలో నుంచి బయటకు నడిచాడు.

తన చదువుల ప్రయివేట్ గదిలోనికి వెళ్లి కూర్చున్నాడు. కుర్చీ చాల మర్యాదగా పలకరించినట్లు అనిపించింది. అక్కడ కూర్చున్న తరువాత ఆలోచనలు వేరయి పోతాయి. ఈరోజు మధ్యాహ్నం సమయం చూచుకుని జవాబులు రాయాలి – అనుకున్నాడు; నిన్న వచ్చిన ఉత్తరాలు ఒక బొత్తిగా బరువుగా కనిపించడంతోటే.

మరోపక్క నిన్న చదువుతూ మధ్యలో ఆపుచేసిన పుస్తకం బోర్లాగా మడిచి ఉంది; చదువుతున్న పేజీ దగ్గర బుక్‌మార్క్ పెట్టి, పుస్తకాన్ని సరిగా మడిచి 'రాక్'లో పెట్టుకుందా మన్న ధ్యాస, తీరుబాటు గూడ లేకుండా పోయినాయన్నమాట! వస్తువులన్నీ జాగ్రత్తగా సుకుమారంగా సజావుగా వాడుకోవడం అలవాటు. అయినా ఉన్నట్లుండి ఒక్కోమారు అశ్రద్ధ అయిపోతుంది. ఆ పుస్తకం చేతులలోనికి తీసుకుని చదవడం ఉపక్రమించ టానికి ముందు - కొద్దిసేపు తనతో తాను మాట్లాడుకోవాలి.

ఈ రోజు ఫలానా తేదీ; ఫలానా వారం.

ప్రత్యేకించి చేయవలసిన పనులు ఏమీ లేవు.

చదువుకోవడం, వ్రాసుకోవడం.

ఎవరయినా స్నేహితులు వస్తే వాళ్లతో కులాసాగా మాట్లాడుతూ కూర్చోవడం. వాళ్లు ఎందుకు వచ్చారో కనుక్కుని తాను చేయగల పని చేసి పంపడం.

తపతి తెచ్చిపెట్టే కాఫీలు, ఫలహారాలు వేళ - పట్టున ఆరగించడం. భోజనానికి రమ్మని పిలుపు వచ్చినప్పుడు ఎక్కువ ఆలస్యం చేయకుండా వెళ్లి కూర్చోవడం.

-దాదాపు ప్రతిరోజూ చేసే పనులు ఇవే.

అయినా ప్రతి ఉదయమూ, నిద్రలేవడంతోటే తనతో తాను మాట్లాడుకోవడం, శరీరం ఎలా ఉంది - దానికి ఇంకా ఏమి కావాలి; మనసుపైని మరుపు పొరలు రాకుండా ఎలా 'ఎలర్ట్'గా ఉండాలి - అన్న విషయాలను ప్రస్తావన చేసుకుంటూ కొంత సమయం గడపడం లాభదాయకం. అలా అని నిరూపితం అయింది అతనికి. ఈరోజు నా శరీరం, నా మనస్సు నా చెప్పు చేతలలో ఉన్నాయి. నేను చెప్పినట్లుగా వింటాయి. నేను చేయమన్న పనులే చేస్తాయి; నేను చెప్పదలుచుకున్న విషయాలనే పైకి తీసుకు వస్తాయి. - ఈరకమైన భరోసాతో రోజు ప్రారంభం చేయడం 'ఆత్మ విశ్వాసం' కలిగిస్తుంది. ప్రపంచమంతా కొత్తదనంలోనికి క్రమంగా మేలుకుంటుంది. ఈ కొత్తదనం నన్నూ పునీతుడిని చేస్తుంది. అందుకు అవసరం అయిన 'పూర్వరంగం' నేను తయారు చేసుకు కూర్చోవాలి.

ఆకాశంలో నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నట్లుగా, నా మనసులోనూ ఎప్పటికప్పుడు కొత్త కాంతులు ప్రసరించాలి. నా చుట్టూ ఉన్న మనుషులతో, పరిసరాలతో నేను ఎప్పుడూ సమరసంగా ఉండాలి. బయటి పరిస్థితులు ఎంత ఘోరంగా అనిపించినా, నా చిత్త ప్రశాంతత నేను కోల్పోకుండా ఉండాలి.

అన్ని రోజులు మోస్తరుగానే ఈ రోజు సజావుగా సరళంగా నడచిపోవాలి.

శేషాద్రి కళ్లు మూసుకు కూర్చున్నాడు.

గలగల పారుతున్న సెలయేరుకు ఎదురుగా కూర్చున్నట్లు ఉంది. ఆ చప్పుడు, ఆ ప్రవాహం వరవడి క్రమంగా అలవాటు అయిపోతాయి. అలవాటు అయిన తరువాత ఏమీ లేకుండా పోతాయి. ఏమీ గుర్తు రాకుండా, ఎలాంటి ఆలోచన మనసును వేధించకుండా కొన్ని నిముషాలు అతిప్రశాంతంగా ఉంటుంది. తరువాత - నిన్నటి పుస్తకం తీశాడు. పేజీ తెరవగానే కనిపించిన పంక్తి :

అతని పక్కగదిలోనుంచి ఓ యువతి ఆక్రందనం విన్నాడు.

ఈ పంక్తి చదవడం తోటే శేషాద్రికి కథాభాగం స్ఫురణకు వచ్చింది.

ఓ సిపాయి కథ అది.

1530 ప్రాంతంలో అతను దక్షిణ అమెరికాలో యుద్ధం చేసి, జర్మనీకి తిరిగి వచ్చాడు.

ఓ హోటలు (సత్రం) గదిలో ఉన్నాడు.

ఒకే ఒక రాత్రి ఆ గదిలో ఉన్నాడు.

పక్కగదిలో ఒక యువతి బసచేసి ఉంది.

అతన్ని పేరు పెట్టి పిలుస్తుంది; అంతకు ముందు పరిచయం లేకపోయినా.

'నాకు దయ్యం పట్టింది. నాకు అన్నీ తెలుసు !' అంటుంది.

అతను ఆమెను ప్రశాంత పరచి నిద్రపొమ్మని చెబుతాడు.

కాని ఆమె తన వృత్తాంతం చెప్పేంత వరకు మరేమి చేయనంటుంది.

ఆమెకు ఎనిమిదేళ్ల వయసులో ఒక 'దేవత' పరిచయం అయిందట.

పెద్దదానివి అయ్యాక నీకు చాలయోగం పడుతుంది. ఇప్పటి నుంచే అందుకు అవసరం అయిన త్యాగాలు, వ్రతాలు చేయి' - అని చెప్పిందట.

యోగినిగా తయారవడం ఆమెకూ ఇష్టమే.

అయితే - తనతో పాటు చదువుకుంటున్న ఒక కుర్రవాడంటే మక్కువ ఏర్పడింది ఆమె మనసుకు.

ఈ మక్కువ ప్రమాదకరం అయిన పరిణామాలు తీసుకురాక ముందే ఆ కుర్రవాడు దూరంగా వెళ్లిపోయాడు.

తరువాత చాల సంవత్సరాలకు ఆ కుర్రవాడే కలలో కనిపించాడట. 'రెండు నెలలకు నేను తిరిగివస్తాను. మనం కలుసుకుందాం-' అని చెప్పాడట.

రెండు నెలల తరువాత ఎవరో వచ్చారు.

ఆ కుర్రవాడే ఇతనా, లేక ఇతను కాదా - ఇతను వేరా అన్నది ఆమె తేల్చుకో లేకపోయింది.

కుర్రవాడి చిత్రం మనసులో ఉన్నది వేరు.

ఇప్పుడు ఎదురుగుండా సాక్షాత్కరించింది మరొకటి.

అయినా వీటన్నిటికీ ఏదో 'సూత్రం', ఏకత ఉన్నట్లుగా మనసు గోలపెడుతోంది.

ఆ అమ్మాయి అతనితో కలిసి వెళ్లిపోయింది.

రెండు మూడేళ్ల తరువాత - అతను ఏమయి పోయినాడో అతీ, గతీ లేదు. చెప్పకుండా చేయకుండా ఏటో వెళ్లిపోయినాడు.

అప్పటి నుంచి ఆ అమ్మాయి అతని కోసరమే ఊరూరూ వెదుకుతూ తిరుగుతూ ఉంది. ఆ అన్వేషణలో భాగంగానే ఇక్కడకు వచ్చిందట.

- ఈ కథంతా విన్నాడు అతను.

సానుభూతి చూపాడు. అంతకంటె ఇంకేమీ చేయలేక పోయాడు.

'నాకు దయ్యం పట్టింది' అని పదే పదే చెబుతుంది. ఆ అమ్మాయి.

ఆమెకది చాల గర్వకారణంగా ఉంది - అనిపిస్తోంది.

ప్రపంచానికి మహారాణిగా నన్ను ఎన్నుకున్నారు - అన్నంత అతిశయంతో చెబుతోంది ఆమె ఈ మాటలు.

'దయ్యం గురించి ఆలోచించడం మానివేయి. హాయిగా విశ్రాంతి తీసుకో. మనసుకు ఊరట కావాలి నీకు. అతని కోసం వెదకడంతో మనస్సు, శరీరమూ అలసి పోయినాయి' అని సలహా చెబుతూ ఉండిపోయాడు.అతను ఆమెతో పాటు గదిలోనే.

ఆమె సరసనే ఆ గదిలోనే ఉండిపోతాడు అతను, ఆ రాత్రంతా.

విచిత్రంగా - ఆమెతో దగ్గరవాలనే ఆలోచన అతన్ని ఆవరించుకుంటుంది. ఆ అమ్మాయి అసహాయ స్థితికి ఎంతయినా సానుభూతి కలుగుతోంది. తన ప్రేమ కూడా ఇందులో భాగమే ననిపిస్తోంది. కాని ఆమె మాత్రం 'నేను నా ప్రియుడి కోసం కాచుకుని కూర్చుంటాను. అతనికే నేను అర్పితం. అన్యులకు కాదు-' అని ఘంటా పథంగా చెప్పడంతో అతను మిన్న కుండిపోవడం తప్ప ఇంకేమీ చేయలేక పోయాడు.

'నీతోపాటు అతన్ని వెదకడంలో నీకు సహాయం చేస్తాను' అంటాడు ఆ అమ్మాయితో. దాదాపు వాగ్దానం చేసినట్లుగానే మాట్లాడుతాడు.

ఆమెతో పాటు చేసే పర్యటనలతో నవల అంతా గందరగోళంగా తయారయి పోయి నడుస్తుంది. పేజీలకు పేజీలు మాయా కల్పితంగా, అమానుషంగా నడిచిపోతూ ఉంటాయి.

ఇంత గందరగోళంలోనూ, మాయలోనూ మనస్సును ఆకట్టుకునే సందర్భాలు

కొన్ని ఉంటాయి.

ఇంద్రజాల మహేంద్రజాలాలను గురించి, మాయలు మర్మాల గురించి ఎన్నెన్నో వివరాలు కనిపిస్తాయి.

మనసు కవ్వించే ఊహాపోహలతో మునిగిపోయి, యథార్థ జీవితాన్ని సజావుగా చూడలేక, కృతకమయిన పరిస్థితులే నిజం - అనుకునే పాత్రలు ఎన్నో కనిపిస్తాయి- ఆ నవలలో.

విషయంతో అంగీకారం లేకపోయినా, చదివించుకు పోవడంలో ఎంతో చురుకుదనం ఉంది ఆ పుస్తకానికి.

ఫ్రాయిడ్ కంటె ముందు కాలంలో వ్రాసిన నవల అది. 1907లో ప్రచురణ అయినట్లు దాఖలా కనిపిస్తోంది. అబ్‌నార్మల్ సైకాలజీ గురించి ప్రస్తావన చేయడం, అలాంటి సన్నివేశాలను చిత్రించడం - అద్భుతంగా ఉంది శేషాద్రికి.

ఏమయినా - మనసుకు ఎన్నో మర్మాలు ఉన్నాయి. మనం ఎంత అర్థం చేసుకున్నాం అనుకున్నా ఇంకా అర్థంకాని లోతులు, ప్రగాఢతలు ఉండనే ఉంటాయి - దానిలో.

ఈ విషయం - విశేషం - అతి స్పష్టంగా కనిపించింది శేషాద్రికి ఈ పుస్తకంలో.

పుస్తకాన్ని గురించి ఆలోచించుకుంటూ కూర్చుంటే కొంత సమయం తెలియకుండానే గడిచి పోతుంది. పుస్తకాన్ని పక్కకు పెట్టి ఏదయినా తేలిక విషయం గురించి ఆలోచించుకుందాం అనుకుంటే అటువంటిది ఏమీ గుర్తు రానే రాదు కొంతసేపు.

చదివిన విషయం మనస్సును అంతగా పరవశం చేస్తుందా ? అది తప్ప ప్రపంచంలో ఇంకేమీ లేదు అనేంతగా మైమరపును తీసుకు వస్తుందా ? ఈ మరుపు పొరలు కూడా కొంత సేపు అయిన తర్వాత విడిపోతాయి గద!

అయిదున్నర గంటలు అవడంతోటే అతని దృష్టి అనుకోకుండా గడియారం మీదకు మళ్లింది.

తపతిని లేపవచ్చు ఇప్పుడు.

మెల్లిగా అడుగులు వేసుకుంటూ పడక గదిలోకి వెళ్లాడు.

తపతి పక్కమీద లేదు.

అప్పుడే లేచేసిందన్నమాట.

బాత్‌రూంలో సన్నగా నీటి ధార.

అయితే ఆమెకు మేలుకొలుపు పాడవలసిన పని లేదు.

శేషాద్రి మళ్లీ తన ప్రయివేట్ గదిలోనికి వచ్చి కూర్చుండి పోయాడు. గోడమీద ఒక బల్లి పరుగెత్తుతోంది. గదిలోంచి బయటకు వెళ్లిపోతోంది. కిటికీలు, వాటి ద్వారా మార్గాలు బల్లులకు తెలిసినట్లుగా ఎవరికీ తెలియవు. 'బల్లిని ఏమీ అనకండి. అవి గంధర్వులు' అని లోగడ ఒక మిత్రుడు చెప్పిన సమాచారం గుర్తుకు వచ్చింది.

యక్షులు, కిన్నెరలు, గంధర్వులు, కింపురుషులు, సిద్ధులు - ఇంకా అనేక పేర్లు పెట్టుకుని, మనుషుల మాదిరిగానే కాస్త కుడి ఎడమలో అటువంటి లక్షణానే పుణికి పుచ్చుకుని ఇంకా - అనేక జీవులు ఈ భూమిమీద ఉన్నాయి, అని వాదించేవాళ్లు చాలా మంది ఉన్నారు ఈ ప్రపంచంలో.

సృష్టిలో 'మనిషి' ఉదాత్తమైన 'జీవి' కావచ్చునుగాని సృష్టి అంతా అతని కోసరమే అనుకోవటానికి లేదు. సృష్టిలో అతనూ ఒక భాగం, విడదీయటానికి వీలులేని భాగం. అసలు సృష్టి అంతటినీ కలిపి కట్టే 'సూత్రం', ఒక్కటిగా రూపొందించే 'ఉపాయం' ఉన్నదా ?

ఉన్నది. అందుకు అనుమానం లేదు - అంటున్నారు. ఈరోజులలో సైంటిస్టులు కూడా.

మతానికి, సైన్సుకు పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే రోజులు పోయాయి. ఒకదానికొకటి అనుబంధ శాస్త్రంగా తయారయినాయి అవి ఇప్పుడు.

మతం ఆవేశాన్ని తగ్గించుకుంటుంది. శాస్త్రం నిదానంగా పరిశీలన నేర్చుకుంటుంది.

ఏదీ తనకు తెలియదు గనుక 'అబద్ధం' అని కొట్టివేయడానికి వీలు లేదు - అని ఈ రోజులలో అందరూ అంగీకరిస్తున్నారు. బాహాటంగానే - ఏమీ మొహమాటం, తమను తగ్గించుకోవడం అనుకోకుండానే - ఈ విషయాన్ని ఒప్పుకోగలుగు తున్నారు.

తలుపుమీద ముచ్చటగా మూడుసార్లు చప్పుడయింది.

శేషాద్రి తల ఎత్తి చూచాడు.

తపతి ద్వారం దగ్గర నిలబడి ఉంది. ఆమె చేతుల్లో కాఫీ కప్పు ఉంది. వేడి వేడి

పొగలు కప్పు మీద నుంచి పారిపోతూ గదిలో ప్రవేశిస్తున్నాయి.

కాఫీ 'కమ్మటి' వాసన కడుపును కదిలించి వేస్తున్నట్లు అయింది. కాస్తంత ఉత్సాహంగా అడుగులు వేసి కప్పు అందుకున్నాడు శేషాద్రి. తపతి వెనక్కువెడుతూ 'అయిదు నిమిషాలలో తయారయి పోతాను. మీరూ సిద్ధం కండి' - అంది.

అలాగే అన్నాడు శేషాద్రి.

సిద్ధం అవవలసింది అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఓ మంచి 'టీ' షర్ట్ తొడుక్కోవడం, కాన్వాస్ బూట్లు వేసుకోవడం, ముఖము - క్రాఫ్ సరీగా ఉన్నాయో లేదో అద్దంలో చూచుకోవడం - అంతే!

తపతి రావడం తోటే ఇద్దరూ ఇల్లు తాళం వేసి బయటకు వెళ్లిపోయారు.

'బాగా తెల్లవారిపోతోంది. నన్ను ఓ అరగంట క్రితం లేపి ఉండవలసింది మీరు-' అంది తపతి.

'పుస్తకం చదువుతూ ఉండిపోయాను. అయిదున్నరకు లేచి చూస్తే నీవు అప్పటికే లేచేశావు. అందుకని ఊరుకుండి పోయాను. పోనీలే తెల్లవారి పోతేనేం గాక! ఓ అరగంట సేపు తిరిగి వచ్చేద్దాం' అన్నాడు శేషాద్రి.

అడుగులు చకచక వేస్తూ నడుస్తున్నారు.

ఉదయం పూట - వీలయినంత ఎక్కువ సేపు - నిరామయంగా తిరగడం, శరీరానికీ మనసుకూ మంచిది - అది శేషాద్రికి ఎన్నో ఏళ్ల నుంచి తెలుసును. డాక్టర్లు కూడా అప్పుడప్పుడూ 'మీరు వాకింగ్ చేస్తూ ఉండాలి. ఆరోగ్యానికి చాలా అవసరం' అని హెచ్చరిస్తూ వచ్చారు. అయితే, అనేక కారణాల వల్ల, బద్ధకం అందులో ప్రధానం అయినది, షికారు తిరగడం అతనికి అలవాటు కాలేదు. 'ఉదయం వీలుకాక పోతే, సాయంత్రం అయినా సరే! శరీరానికి ఆ మాత్రం వ్యాయామం అవసరం - లేకపోతే అంగాలు చచ్చుపడి పోవడం జరిగినా ఆశ్చర్యం లేదు -' అని భయపెట్టారు గూడా స్నేహితులు.

అయినా ఇన్ని సంవత్సరాలూ 'షికారు' గా నడవడం, వ్యాయామం కోసం సమయాన్ని ఖర్చు పెట్టడం కుదరలేదు.

ఇప్పుడిప్పుడే ఆ గమనం ఇస్తున్నాడు.

ఏ పని అయినా ఒంటరిగా చేయడం అంతగా అలవాటు లేదు గనుక, తోడుగా 'తపతి'ని కూడా తీసుకు వెడుతున్నాడు - వాకింగ్‌కు.

ఇంటికి అయిదు నిముషాల దూరంలోనే బంగాళా ఖాతం; దాని తాలూకు బీచ్. సముద్రపు గాలి ఒంటికి మంచిది. సముద్ర స్నానం చేయడం మంచిదని తెలుసును గాని, ఇంతవరకు ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు.

బీచ్‌రోడ్ మీద అరగంట సేపు షికారుగా - గబగబ - నడవడం ఆనందదాయకం గానే ఉంది. పరిచయం అయిన వాళ్లు, అంతగా పరిచయం లేని వాళ్లు చాలా మంది కనిపిస్తారు. కొత్తగా పరిచయాలు ఏర్పరుచుకుందుకూ ఇదో మంచి అవకాశం. అన్ని వయసుల వాళ్లూ తిరుగుతూ ఉంటారు. యువతీ యువకులు, రిటైర్ అయిపోయి రికామీగా ఉంటున్న వాళ్లు, ఉద్యోగాలు - వ్యాపారాలు చేసుకుంటూ ఊపిరి పీల్చటానికి కూడా సమయ విరామం విరివిగా లేనివాళ్లు - ఇలా రకరకాల మనుషులు ఉదయం పూట వాతావరణంలో స్వేచ్ఛగా తిరుగాడుతారు. శరీరం పెంచిన వాళ్లు మాత్రమే చేయవలసింది కాదు ఈ షికారు. కేవలం 'లావు తగ్గించు కుందుకు మార్గం' అని సరిపెట్టుకోవటానికి వీలుకాదు.

శరీరం చురుకుగా ఉండటానికీ, నరాశయం వీర్యవంతంగా పని చేయటానికి ఈ వాహ్యాళి బాగా ఉపకరిస్తుంది. ప్రత్యక్ష అనుభవం తరువాత గాని శేషాద్రికి ఇవన్నీ తెలిసి రాలేదు. స్నేహితులు కనిపించినా ఎక్కువ సేపు మాట్లాడుకునే సన్నివేశం కాదు ఇది. ఒక మాట, అరమాట - అంతే !

ఒక్కొసారి కేవలం చేతులు విసురుగా, హుషారుగా ఊపుకోవడంతో సరిపోతుంది.

ఈ పని పూర్తి చేసుకునే సరికి - ఇంటి దగ్గర న్యూస్ పేపర్ వచ్చి ఉంటుంది.

వరండాలోనే కూర్చుని పత్రిక పేజీలు పరిశీలించసాగాడు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధ వాతావరణం అలుముకుంటున్నదీ, ఎక్కడ మనుషులు విపరీత చర్యలలో మునిగి పోయి మామూలు ప్రజ్ఞ, కోలు పోతున్నారు - ఇలాంటి విషయాలు తెలుసు కోవాలంటే వార్తా పత్రికను మించిన సాధనం మరొకటి లేదు.

పత్రికల నిండా రాజకీయ వార్తలు, ఒకప్పుడు జీవితంలో రాజకీయం తప్ప ఇంకేమీ లేదన్నట్లు ఉండేవి పత్రికలు.

ఇప్పుడు కాస్త నయం.

ఆడవాళ్లకు ఏడువారాల నగల మోస్తరుగా - ప్రతివారమూ ఏదో ఒక ప్రత్యేక ప్రక్రియ తీసుకుని, దానిని గురించి విశేషవ్యాసాలు - వార్తలు - సమీక్షలు రాస్తున్నారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, వాణిజ్యం, ఆటపాటలు, జీవన విధానాలు, భవిష్యత్తుకు తగిన విధంగా రూపుదిద్దుకోవడం - మహిళలు - మహోద్యమాలు - ఇలా ఒక్కో పత్రిక విభాగం ఒక్కో విధంగా విషయ వివరాలు ఇస్తూ చదువరులకు కనువిందు, మనసులకు మహదానందం కూర్చటానికి ప్రయత్నం చేస్తున్నారు.

ముఖ్యంగా ఆదివారం నాడు, రెండు ఇంగ్లీషు పత్రికలు, అయిదు తెలుగు పత్రికలు పట్టుకు కూర్చున్నామంటే - సాయంత్రం మళ్లీ షికారుకో, సభకో వెళ్లవలసిన సమయం ఆసన్నమయ్యే వరకు ఆ కాగితాల ప్రతులు తిరగవేయడం పూర్తికాదు.

ఇన్ఫర్మేషన్ ఎక్స్‌ప్లోజన్ - జరుగుతోంది - ఏ అంశాన్ని తీసుకున్నా.

ఇదివరకో 'జోక్' ఉండేది.

రోడ్డు మీద పోతున్న మనిషిని 'టైమెంత అయిందండీ?' అని అడిగాడట ఒక ఆసామి.

ఇంక ఆ పెద్ద మనిషి ఇదే సందు దొరికిందనుకుని - ఆ సాయంకాలం వరకు గడియారాలు ఎలా తయారు చేస్తారో, ఈ తయారీలు పరిణామ ప్రక్రియలు దేశ దేశాలలో ఎలా రూపుకట్టుకున్నాయో సుదీర్ఘంగా ఉపన్యాసం ఇస్తూ కూర్చుండిపోయాడట!

గడియారాలు - పుట్టు పూర్వోత్తరాలు

గడియారాలు - సమయ సందర్భ పురస్కారాలు

గడియారాలు - దేశదేశాల పరిశ్రమలు పరిక్రియలు

గడియారాలు - సూర్య సిద్ధాంతం

గడియారాలు లేక ముందు సమయం ఎలా తెలుసుకునే వాళ్లు ?

- ఈ విషయ పరిజ్ఞానానికి విస్తుపోవడంతోపాటు అడిగిన ఆసామికి విసుగు పుట్టిందో ఏమోగాని. తీరా అతడు టైం తెలుసుకుని ఆ సమయానికి చేయవలసిన పనిని ఆ రోజుకు తాత్కాలికంగా మరచిపోవలసి రావడం మటుకు తప్పని సరి

అయిపోయింది.

నీడను పాదాల అడుగులతో కొలిచి, టైం కనుక్కోవడం ఎలాగో శేషాద్రికి చిన్నప్పుడు తాతగారు చెప్పారు.

ఆ సూత్రం ప్రకారం పనిచేస్తే సూర్యోదయానంతరం ఎన్ని ఘడియలు అయిందో తెలుస్తుంది. లేదా సూర్యాస్తమయానికి ఇంకా ఎన్ని ఘడియలు ఉందో తెలుస్తుంది.

ఘడియలు తెలిసిం తర్వాత దానిని గంటలలోనికి మార్చుకోవడం తేలిక.

రెండున్నర ఘంటలు అయితే ఒక గంట.

తెలుగు లెక్కల ప్రకారం రోజుకు అరవయి ఘడియలు. ఇంగ్లీషులో అయితే రోజుకు ఇరవై నాలుగు గంటలు.

మనిషి సూర్యుడికి ఎదురుగా నించోవాలి.

అతని నీడ పడుతుంది నేలమీద.

చెవిలో వేలు పెట్టుకోవాలి. నించున్న చోటు నుండి ఆ చోటు దాకా అడుగులు అడుగు వేసుకుంటూ ఎన్ని 'పాదాల ప్రమాణం' ఉందో కొలుచుకోవాలి. ఆ పాద ప్రమాణాన్ని ఏదో అంకెతో హెచ్చవేత వేసుకోవాలి; తరువాత ఓ భాగహారం కూడా చేయాలి. తెలుసుకోవటానికి ఇదీ ఆయువు పట్టు.

విధానం గుర్తుంది కాని ఆ అంకెలు - ప్రక్రియ - మటుకు మరచి పోయినాడు శేషాద్రి.

చిన్నప్పుడు ఇటువంటి విషయాలు తెలుసుకోవడంలో ఎంతో ఆసక్తి, కుతూహలం ఉండేవి.

ఈ సంగతి నాకు తెలుసును. నీకూ్కడా తెలుసా లేదా ? - అని ఇతర కుర్రవాళ్లను అడిగి విషయ వినిమయం (ఎక్స్ఛేంజ్) చేసుకోవడంలో ఎంతో ఆనందం, ఊరట ఉండేవి.

ఇప్పుడు 'విజ్ఞాన సర్వస్వాలు' అనేక సంపుటాలు తయారయి కూర్చున్నాయి. పుస్తకాలు ఎన్నెన్నో వాల్యూములుగా వరుసలు తీరి కూర్చుంటున్నాయి. మరో పక్క 'పుస్తకం' మరుగయిపోయి, ఇంకేదో హైటెక్నాలజీలో విషయాలను నిక్షిప్త పరచే మార్గం - మైక్రో ఫిల్మింగ్, వీడియో మేకింగ్, సి.డి. రామ్ - ఇత్యాది ప్రక్రియలు విస్తరిస్తున్నాయి.

పత్రికల గురించి ప్రస్తావన వస్తే పేజీలకు పేజీలు నిండిపోయేంత వ్యాఖ్యానం చేయవచ్చు. కాని, ఇతర పనులు ఇందుకు అభ్యంతరం చెబుతాయి.

ఇంకా స్నానం చేయాలి.

రోజువారీ కార్యక్రమాలు ఏమేం ఉన్నాయో చూచుకోవాలి.

స్నానానికి 'నాంది'గా మరో కప్పు టీ తీసుకోవడం మామూలు.

• • •

ఆ మధ్యాహ్నం శేషాద్రి తీరుబాటుగా టీ తాగుతూ ఉండగా ఒక ఆసామి వచ్చాడు. చాల అతలాకుతలంగా, గందరగోళంగా ఉంది అతని వాలకం. చూడడానికి అరవై ఏళ్లు దాటి సీనియర్ సిటిజెన్ హోదాకు ఇంకో రెండు మూడేళ్లలో అర్హత సంపాదించే స్థితిలో ఉన్నట్లున్నాడు.

శేషాద్రి అతన్ని తీరుబాటుగా పరిశీలించాడు.

'ఒక్క అరగంట మీ సమయం నా కోసం ధారాదత్తం చేయాలి మీరు. మిమ్మల్ని నేను ఎరుగను. కాని విన్నాను. నా సమస్యలకు వేదనలకు మీరే పరిష్కారం చూపుతారని ఎవరో చెప్పగా విని పరుగుతీసుకుంటూ వచ్చాను. నా విషాద గాథ మీరు వినాలి' అన్నాడు - ఆ ఆసామి. శేషాద్రి అతన్ని ముందు కూర్చుని టీ తాగమన్నాడు.

విశ్రాంతి తీసుకోమన్నాడు. కాని ఆ ఆసామికి తన కథంతా ముందు ఏకరువు పెట్టేసి తీరుబడిగా కూర్చోవాలనుంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ముందుగా ఇంటి దగ్గరే - లేదా ప్రయాణంలో - బాగా రిహార్సల్ వేసుకు వచ్చినట్లున్నాడు - ఇదంతా బయటకు కక్కేస్తేగాని మనస్సు ఊరట పడదు.

కాని అతని ఆరాటం మీద నీళ్లు చల్లాడు శేషాద్రి.

'అయ్యా, మీకు ఎందుకంత తొందర ? అవసరం అయితే ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోదురుగాని' అన్నాడు.

శేషాద్రి తన పని తను చూచుకుంటూ, ఉత్తరాలు వ్రాసుకుంటూ, కూర్చున్నాడు. ఆ ఆసామి ఇంక చేసేదేం లేక పడక కుర్చీలో సునాయసంగా విశ్రాంతి తీసుకుంటున్నాడు.

తపతి ఓ గంట తర్వాత ఇవతలకు వచ్చింది.

'మీకు గుర్తేననుకుంటాను. ఎవరో పై ఊరి నుంచీ వస్తానన్నారు. మీతో మాట్లాడటం కోసం. వాళ్లు వచ్చే సమయం అవుతోంది' - అంది. 'అవును జనాభా పెరిగిపోవటం - ప్రచార సాధనాలు మరింత విస్తృతంగా పనిచేయడం - ఈ అంశాల మీద నా అభిప్రాయాలు కావాలంటూ వ్రాసిన 'గుంపు' గురించే కాదూ నీవు చెప్పేది. నాకు గుర్తుంది', అని మిన్నకుండి పోయాడు.

'వాళ్ళు వచ్చే లోపలే మీరు ఈ అరుణాచలం గారి పని చూచి పంపివేయవచ్చును గదూ' అని సిఫారసు చేస్తున్నట్లుగా అంది తపతి మళ్లీ.

అరుణాచలం - ఆ వచ్చిన ఆసామి పేరు అదే - ఆసక్తిగా పైకి లేచాడు. తపతి వంక, 'థాంక్స్' అన్నట్లుగా చూచాడు. అయినా శేషాద్రి ఈ మారూ లొంగి రాలేదు.

'అరుణాచలం గారు ఈ రాత్రి ఇక్కడే ఉంటారు -' అన్నాడు శేషాద్రి, తీర్పు ఇచ్చేస్తున్నట్లుగా.

అరుణాచలం దిగ్గున లేచి శేషాద్రికి దగ్గరగా వస్తూ 'అయ్యా, నన్ను అరుణాచలం గారు - గారు అని ఎందుకు ఉత్తినే పెద్దవాడిని చేస్తారు ? మీ ముందు నేనెంత ? అనామకుడిని. గార్లూ గీర్లూ తీసేసి నన్ను పేరుతో పిలవండి చాలు. మరీ పొడుగు పేరు అనిపిస్తే 'చలం' అనండి, అంతే చాలు. నా సమస్యలంటారా - అని అప్పుడే పరారయి పోయినట్లు అనిపిస్తోంది నాకు. అవి ఏకరువు పెట్టటానికి నా దగ్గర ఇప్పుడు మాటలు కూడా కరువయి పోయినట్లయింది. అసలు మీరు నన్ను చూడరనుకున్నాను, ఇంట్లోకి రానివ్వరనుకున్నాను. మీ ఆదరణ, మన్నన చూచాక నాకు ఇంకేం మాట్లాడాలో అర్థం కావడం లేదు. అంతేకాదు. మీ సమయం వృథా చేసేస్తున్నందుకు సిగ్గుగా కూడా ఉంది సుమండీ' అన్నాడు.

శేషాద్రి ఏమీ మాట్లాడకుండా తన పని తాను చేసుకుంటూ కూర్చున్నాడు.

ఆ 'గుంపు' రానే వచ్చారు. చాలాసేపు శేషాద్రితో ఏమేమిటో మాట్లాడారు. అరుణాచలానికి అదంతా బొత్తిగా అయోమయంగా ఉంది. విషయం అర్థం కాదు; వివరం అసలే తెలియదు. కాని వాళ్లు మాట్లాడుతున్న తీరు, శేషాద్రి వాళ్లకు సమరసంగా సమాధానలు చెబుతున్న పద్ధతీ అతనికి అక్కజం అనిపిస్తున్నాయి.

వాళ్లు వెళ్లిపోవటానికి ఆయత్తం అవుతున్నారు ఒక గంట అయిన మీదట.

అప్పుడు శేషాద్రి వాళ్లకు అరుణాచలాన్ని పరిచయం చేస్తూ ఇలా అన్నాడు. 'మీకు కావలసింది ఇలాంటి మనిషి. ఇతనికి జీవితానుభవం చాల ఎక్కువ. ఇతరులతో తన అనుభవాల సారాన్ని పంచుకోవాలని ఎంతో ఆసక్తిగా ఉన్నది ప్రస్తుతం - కాని ఎవరి పనులు వాళ్లవి; ఎవరు వింటారు ? ఎవరు ఆలోచిస్తారు ?'

వాళ్లు కూడా అరుణా చలం పట్ల ఆసక్తి చూపనారంభించారు. ఎక్కడ ఉంటున్నారు? ఏం చేస్తున్నారు ? ఇక్కడికి ఎలా - ఎందుకు - ఎప్పుడు వచ్చారు ? ఎన్నాళ్లు వుంటారు ? - ఇలా రకరకాల ప్రశ్నలతో అతన్ని గుచ్చెత్త నారంభించారు. ఆ తాకిడికి తట్టుకోవడం అరుణా చలానికి అసాధ్యం అయిపోయింది. మళ్లీ శేషాద్రే అతన్ని ఈ ఉపద్రవం నుంచి రక్షించాడు. 'ఆగండి, ఆగండి. మీ వాగ్బాణాలతో ఆయన్ను గుచ్చెత్తకండి. మీరు ఇళ్లకు వెళ్లి తీరుబడిగా ఆలోచించుకోండి మనం చర్చించుకున్న అంశాలన్నీ. అప్పుడు ఈయన అవసరం మీకు ఉన్నదనుకుంటే - మరో రెండు రోజుల పోయాక ఇక్కడకు రండి. ఈయన ఇక్కడే ఉంటారు. మరేం బెంగవద్దు, భయం వద్దు. వచ్చిన అవకాశం జారి పోతుండేమోనని ఆదుర్దా పడకండి. అసలు మీకు ఇలాంటి మనిషి అవసరమా లేదా తేల్చుకోండి ముందు' - అని తాపీగా చెప్పేసి వాళ్లను సమాధాన పరిచాడు.

వాళ్లందరూ ఇద్దరికీ నమస్కారాలు చెప్పి వెళ్లిపోయారు. వెళ్లే ముందు చేతి సంచి లోంచి గంధపు చెక్కల మూట బయటకు తీశారు. దాన్ని అతి భద్రంగా శేషాద్రి చేతుల్లో ఉంచుతూ - 'మా ఊరి మంచి గంధం. ఈ చెక్కలు మీ దగ్గర ఉంచండి. గంధం తీసి పళ్లెంలో ఉంచారంటే, వారం రోజుల పాటు ఆమడ దూరం ఆ సువాసన అలాగే ఉండిపోతుంది. మరెక్కడా ఇలాంటి చెక్కలు, కర్రలు దొరకవు. మీకు తెలియదని కాదు; మా ఊరివి కదా అని మరీ మరీ చెబుతున్నాం' అన్నారు.

వాళ్లు వెళ్లిపోయిం తర్వాత అరుణాచలం దాదాపు నిర్ఘాంతపోయిన ధోరణిలో అన్నాడు: 'అయ్యో ! వాళ్ల ముందు నన్నేదో పెద్ద వాడిని చేసి మాట్లాడారు. నేనెంత అల్పుడినో నాకు మాత్రమే తెలుసు. ఇంతకూ వాళ్లకు నా వల్ల కావలసిన పనేమిటో సెలవిచ్చారు కాదు -'

శేషాద్రి తన మామూలు ధోరణిలోనే నిరాసక్తంగా సమాధానం ఇచ్చాడు. 'అప్పుడే

ఏదో అయిపోతోందని కలవర పడకండి. వాళ్లు మళ్లీ వచ్చినప్పటి మాట కదా ! నా అంచెనా నిజం అయితే వాళ్లు తిరిగి రారు; రెండు రోజులు కాదు గదా - రెండు దశాబ్దాల తరువాత కూడా ! సమస్యలు తీరిపోయిన తర్వాత, పాత సంగతులు నెమరు వేసుకుంటూ ఎవరు కూర్చుంటారు ? పాత సమాచాలరాల సమాధులు వెదికి, బూడిద ఎవరు ప్రోగు చేసుకుంటారు ? - ఇదీ అంతే !'

అరుణాచలానికి ఈ మాటలూ అర్థం కాలేదు. అయినా వివరణలు అడగకుండా మిన్న కుండి పోయాడు. ఇంకా రెండు రోజుల పాటు ఉండాలి, ఈ స్తిమిత వాతావరణం లోనే. తను ఏం చేయాలి ఇక్కడ ? సోది అంతా వెళ్లబోసుకుని నాలుగు మంచి మాటలు చెవిని వేసుకుపోదామని వచ్చిన మనిషికి ఇక్కడ 'తప్పనిసరి బందీ' అయిపోయింది. అరుణాచలం మనస్సులో గుణింతాలు వేసుకుంటున్నాడు.

• • •

మూడో రోజు సాయంత్రం - భోజనాలు కూడా అయిపోయిం తర్వాత - ఇద్దరూ ఆరుబయట దివానాల్లో మెత్తగా ఊగుతూ కూర్చున్నారు. పైన ఆకాశం మేఘాలు కమ్ముతూ వెసులు బాటు లేకుండా టోపీలు అల్లుతోంది. మరోపక్క నక్షత్రాలు మిల మిల మెరుస్తూ ఇలాతలాన్ని మురిపిస్తున్నాయి. గతాన్ని వర్తమానంతో పోల్చుకోవడం మనస్సు చేసే పని. అరుణాచలం వినయం ఉట్టిపడుతూ అన్నాడు. 'అయ్యా, మూడు రోజులు మీ సాన్నిధ్యంలో హాయిగా గడిపాను. నాకు సెలవు ఇస్తే రేపు తెల్లవారడం తోటే మా ఊరికి వెళ్లిపోతాను.'

శేషాద్రి అతని వంక చిరునవ్వుతో చూస్తూ 'అప్పుడే వెక్కసం అయి పోయిందా ఈ చోటు ? జీవిత శేషం అంతా ఇక్కడే గడిపి వేస్తానని అన్న మాటలు ఏమయి పోయాయి?' అన్నాడు.

అరుణాచలానికి తన మాటలు తనకే వచ్చి ఎట్లా చేరుతున్నాయో అర్థం అయింది. 'ఉండవచ్చుననుకోండి. మీరు దయా స్వరూపులు' కాని నేను మాత్రం ఏ పనీ పాటు లేకుండా ఇక్కడ షడ్రసోపేతంగా భోజనాలు చేస్తూ ఎన్నాళ్లు ఉండగలను ? నాకయినా సిగ్గూ శరమూ ఉండద్దూ ? - ఇంకొకళ్ల మీద నా భారాన్ని పడేసి రికామిగా నిర్నిమిత్తంగా కూర్చోవటానికి ! - నా వాళ్ల దగ్గరకు వెడతాను; వాళ్ల మీదనే వాలి పోతాను. నా

హక్కులు నేను నిలబెట్టుకుంటాను; సాధించుకుంటాను - మనసుకు ఏమీ గుంజాటన లేకుండానే !' అన్నాడు.

'చూడు, అరుణాచలం. ఈ విశాల విశ్వంలో ఎవరూ ఎవరికీ బరువు కాదు. మనమంతా పరస్పర ఆశ్రయంతో, ఉభయ కుశలోపాయాలతో బతుకుతున్న వాళ్లం. మనం ఎంత కాదనుకున్నా, వద్దనుకున్నా - ఈ ప్రపంచంలో ఎవరికో అత్యవసరంగా అవసరం అయినవాళ్లమే ! మన అవసరం ఎవరికి ఉంది ? ఎవరితో మనం సమరసంగా రోజులు గడిపివేయగలం అన్న సంగతి ఎవరికి వారు తేల్చుకోవాలి; తమను తాము పరీక్షపెట్టుకుని నిగ్గు తేల్చుకోవలసింది ఈ సంగతే ! అప్పుడు మనస్సులు, వికారాలు, వింత పోకడలు - ఇవన్నీ మటుమాయం అయిపోతాయి. ఊహల్లో తేలిపోవడం, తూలి పోతున్నాం - అనుకోవడం కాకుండా నేల మీద స్థిరంగా నిలబడ గలుగుతాం. బలంగా పెరగ గలుగుతాం. అంతే జీవిత సూత్రం!' అన్నాడు శేషాద్రి, అరకన్నుల లో నుండే బయటి లోకాన్ని చూస్తూ, అతని ఆలోచనలోచనాలు అరుణాచలానికి ఎంతో ప్రశాంతత తీసుకు వచ్చాయి.

అరుణాచలానికి ఇప్పుడు భార్య ఒక సమస్య కాదు. కొడుకులు, కోడళ్లూ తననూ వేధించుకు తినడానికే పూనుకున్న యమదూతలు కాదు. ఇన్నాళ్లూ తాను మనసులో పడ్డ గుంజాటన అంతా గుండెను బలవంతంగా నొక్కిపెడుతోంది. ఆపేక్ష, అనాపేక్ష వలయాలుగా తిరిగి హృదయంలోంచి దూరంగా పైదొలుగుతున్నాయి.

శేషాద్రి మనస్సును గురించి ఏమీ మాట్లాడలేదు. మనిషిలో 'కేంద్రా'న్ని గురించి ప్రస్తావించనే లేదు. కేంద్రం ఉంటే అనేక వికారాలు, సంకల్ప వికల్పాలు చోటు చేసుకుంటాయి. కేంద్రమే లేకపోతే వాటికి ఆయువు పట్టు కాదు, అస్థిత్వం లేదు అంతా జాగరూకం.

శేషాద్రి అరుణాచలానికి ఓ పెద్ద గంధపు చెక్క ఇచ్చాడు. 'దీన్ని అరగదీసుకో. గంధపు చుక్క రోజూ పొద్దున్న ముఖాన పెట్టుకో. ఎదురు రొమ్ముకు హృదయానికి కొంత పూసుకో. ఏం జరిగినా - జరగకపోయినా - నీ ఒంటికి చల్లదనం వస్తుంది. ప్రశాంతంగా ఉండగలుగుతావు -' అన్నాడు. శేషాద్రి ఏమీ మారలేదు. అరుణాచలం సెలవు తీసుకు వెళ్లిపోయిన తరువాత, పుస్తకంలో చదివిన ''దయ్యం పట్టిన అమ్మాయి''

స్ఫురణకు వచ్చింది. ఆ అమ్మాయికి కూడా ఈ గంధపు చుక్క అందితే బాగుండును. అరుణాచలానికి దొరికిన ప్రశాంతత ఆమెకూ అవసరం కదూ ?

✦